## కథ

బౌవాజీ! బావాజీ!''

గట్టిగా అరచినా వినపడనట్లు- వీక్లీ కొనుక్కుని వెళ్ళిపోతున్న సూర్యం బావ పోకడ చూసి ఆశ్చర్యపోయాడు- ఆఫీసు పనిమీద హైదరాబాద్ వచ్చిన చంద్రం.

బావ ఎందుకలా పారిపోతున్నాడో, అసలు హైదరాబాద్‌కి ఎందుకొచ్చాడో అర్థంకాక ఆలోచనలతో బుర్ర ఖరాబు కాగా, అటూ ఇటూ తిరిగి చివరకు కాఫీ హోటల్‌లో దూరితే-

అడుగో బావ! ఇడ్లీ గుటుకూ గుటుకూ మింగుతూ, హఠాత్తుగా తన రాక గమనించి- లేచి పారిపోయే వీలు కుదరక కాబోలు ఏడుస్తున్నట్టు నవ్వి ''చంద్రుడూ! నువ్వేనా?' ఏమిటిలా వచ్చావ్''! అన్నాడు.

అతని ప్రక్క సీటులోనే చంద్రం కూలబడ్డాడు గాని టిఫిన్, కాఫీ అయేవరకూ ఇద్దరూ మాట్లాడుకోనే లేదు.

బిల్లు చెల్లించి బయటకునడుస్తూ, ''మా రూంకి రా'' అన్నాడు సూర్యం పొడిగా. రూంకి వెళ్ళాక కూడా ఏమీమాట్లాడకుండా మూతి బిగించుకొని కాసేపు పచార్లుచేశాడు. తర్వాత లుంగీ కట్టుకుని, బాత్‌రూంకి వెళ్ళాడు. వచ్చాడు. తర్వాత ముఖం తుడుచుకునే కార్యక్రమం- ఐదునిమిషాలు. ఆతర్వాత ఏదో చెప్పబోయి, మనసు మార్చుకుని, వీక్లీ చదువుకుంటూ కూర్చున్నాడు- అక్కడ మరో మనిషి లేనట్టు.

చంద్రం చిన్నగా సకిలించినా, తర్వాత పెద్దగా దగ్గినా, ఉహూ....సూర్యం పత్రికలో నుంచి దృష్టి మరల్చనే లేదు. ఆ వింత ప్రవర్తనకు ఏదో బలమైన కారణం ఉండాలి. ''మా వల్ల ఏదైనా తప్పు జరిగిందా- బావా?'' దీనంగా అడిగాడు చంద్రం.

ఛటుక్కున తలెత్తి, కత్తులు దూస్తున్న చూపు ఒకటి విసిరి ఏదో అనబోయి సంబాళించుకుంటూ ''ఈ కథ చదువు'' అంటూ వీక్లీ అతని ముందుపడేసి, విసవిసా బాత్‌రూంకి వెళ్ళిపోయాడు సూర్యం. ఆ తీవ్రతకు నివ్వెరపోయినా కాసేపటికి తెప్పరిల్లి కథ మీదకు దృష్టి మరల్చాడు చంద్రం.

''అనురాగం, ఆప్యాయత, ప్రేమ కలబోసి లాలించి కొడుకుని పెంచి, పెళ్ళి చేసి తర్వాత అతగాడి నిరాదరణకు నొచ్చుకొని- ఏ స్వార్థం లేకుండా తల్లిగా బాధ్యత తీర్చుకున్నాను. కొడుకుగా వాడి బాధ్యతేమిటో వాడే తెలుసుకొనే వరకూ నేనేం చేయగలను?- అని సరిపుచ్చుకొని స్వగ్రామం తిరిగొచ్చేసిన ఒక అమ్మ కథ- అమ్మ ప్రేమ అలాంటిది''

బాత్ రూం నుంచి వస్తూనే- ఎలా ఉంది కథ?- అని అడిగాడు సూర్యం.

''బాగుంది. నువ్వు రాయలేదు కదా, అందుకని!'' తన జోక్‌కి తనే నవ్వుకుంటూ అన్నాడు చంద్రం.

కానీ సూర్యం ముఖం చూడగానే ఆ నవ్వు ఆగిపోయింది! బావ ఏదో దాస్తున్నట్టు తెలుస్తూనే ఉంది. ''నీ మనస్సులో వున్నదేమిటో సంకోచం లేకుండా చెప్పు బావా!'' అనునయంగా అడిగాడు చంద్రం.

వెంటనే చెప్పలేదు సూర్యం. కుర్చీ దగ్గరగా లాక్కుని వీక్లీలోని కథ పేరు కొట్టేసి ''ఇలాంటి అమ్మలూ ఉన్నారు'' అని రాసి, ఆ అక్షరాలకు నగిషీలు చెక్కుతూ కూర్చున్నాడు చాలాసేపు. తర్వాత తల ఎత్తిచంద్రం వైపు సూటిగా చూసి అన్నాడు. ''అమ్మలందరూ కథలో అమ్మలాగా బాధ్యతఎరిగి, ప్రేమను పంచేవారే అయితే ఎంత బావుండేది! కానీ కుతంత్రాలతో మరో తల్లి పచ్చని కుటుంబంలో చిచ్చుపెట్టే మీ అమ్మలాంటి మహాతల్లులూ ఉన్నారు!'' చంద్రం ఉలిక్కి పడ్డాడు. అతనికి అమ్మంటే అమిత ప్రేమ. ఆమెను ఎవరేమన్నా సహించలేడు. ఇప్పుడు సాక్షాత్తూ బావే- అమ్మను హేళన చేస్తున్నాడు! అయితే బావని ఏమీ అనలేక ఆవేశాన్ని అణచుకుంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

ఆ కన్నీళ్ళు చూసి చటుక్కున లేచి బయటకు వెళ్ళిపోయాడు సూర్యం.

సూర్యం రాజమండ్రి కాలేజీలో లెక్చరర్. మంచి వాడు. మంచిగా జీవించాలని ఆరాటపడే వాడూను. అత్తాకోడళ్ళ ఆరళ్ళు, ఒదినా ఆడపడుచుల పొరపొచ్చాలూ లేకుండా, తమ కుటుంబం ఆదర్శప్రాయంగా ఉండాలని అతని అభిలాష.

నిజానికి అతనిభార్య బిందుకూడా అందరితో కలిసి మెలిసి అరమరికలు లేకుండానే మసిలింది కొంతకాలం.

పెళ్ళయిన తర్వాత కూడా అలవాటు ప్రకారం జీతం తల్లి చేతిలో పెట్టాడు సూర్యం. ''నా కెందుకురా! కోడలి కివ్వు'' అందామె.

''నాకొద్దు. అత్తగారికే ఇవ్వండి'' అంది బిందు.

అలా కాదని, ఆ డబ్బుని ఒక డబ్బాలో వేసి ఎవరి అవసరాలకు వారు తీసి వాడుకోవడం ప్రారంభించారు. ఎవరు ఎప్పుడు ఎంత తీసుకున్నదీ ఒక కాగితం మీద నోట్ చేసేవారు.

జీతాల రోజు సూర్యం స్వీట్స్ కొని తెచ్చేవాడు. అందరూ కలిసి ఒకేసారి భోజనం చేసేవారు. అందరూ కలిసే సినిమాలకూ షికార్లకూ వెళ్ళేవారు-హాయిగా.

చదువుకున్న అమ్మాయి ఇంట్లో కూర్చోడం ఎందుకని భార్యకు ఒక కాన్వెంట్‌లో ఉద్యోగం సంపాదించాడు సూర్యం. ఆ కాన్వెంట్- ఇంటికి చాలా దూరం. సిటీ బస్సులో వెళ్ళి రావాలి. అదొక్కటే సమస్య.

మొదట్లో బిందు తన జీతం కూడా తెచ్చి ఉమ్మడి డబ్బాలోనే ఉంచేది. అందరూ చిలో పాలో మంటూ ఉండేవారు.

ఆ కుటుంబంలో చిన్నా చితగా అన్న తేడా లేదు. ఎక్కువ తక్కువలు లేవు. ఈర్ష్య, అసూయలు లేనే లేవు. అంతా సమానమే.




సంసారం హాయిగా సాగిపోతోంది. లోకంలో లేనిదేదో సాధించినట్టు ఎంతో గర్వంగా, సంతృప్తిగా ఉండేది సూర్యానికి.

కానీ-రోజులన్నీ ఒకేలాగ సాగిపోతే కథే లేదు!

అత్తవారి ఊరు కాకినాడ- రాజమండ్రికి దగ్గరే. బస్సులో గంటన్నర ప్రయాణం. అందువల్ల సూర్యం ఇంటికి అత్తగారి రాకపోకలు ఎక్కువైనాయి. ఆమె వచ్చి వెళ్ళిన ప్రతిసారీ ఆ ఇంటిలో ఏదో ఒక సమస్య తలెత్తడమూ ప్రారంభం అయింది. బిందులో మార్పు ప్రారంభం అయింది.

ఉమ్మడి జీతం డబ్బా మాయమయింది. భర్త తెచ్చిన జీతం తన చేతికే ఇవ్వాలని బిందు పేచీ మొదలుపెట్టింది. సినిమాలకూ షికార్లకూ- అందరితో కలిసి కాక- మనమిద్దరమే వెళ్ళాలి అని రగడ. మనం బాల్కనీ క్లాసు, వాళ్ళు బెంచి క్లాసు అని ఆంక్ష. జీతాల రోజు స్వీట్స్‌తెస్తే అవన్నీ తమ కోసం దాచేసి, మిగిలిన వారికి చిన్న ముక్కలు చిదిమి పెట్టడం-సిటీ బస్సులో కాన్వెంట్‌కి వెళ్ళడం ఇబ్బందిగా వుంటోంది. కాన్వెంట్‌కి దగ్గరగా ఇల్లు అద్దెకు తీసుకుని మనమిద్దరమే ఉందాం- అని సతాయింపు. మన జీతాలు ఉమ్మడిగా ఖర్చు పెట్టేస్తే పుట్ట బోయే పిల్లలకు మిగిలేది చిప్పే, దొప్పే! ముందు చూపుతో ఇప్పటినుంచే దాచుకోవాలి అని హితబోధ.

ఈ వేధింపులూ, సాధింపులూ, సతాయింపులతో సంసారం అంటేనే వెగటు పుట్టింది సూర్యానికి.

అతని పరిస్థితి అలా ఉండగా-

అతనితో బాటే అదేరోజు అదే కళ్యాణ మండపంలో వివాహం చేసుకున్న చంద్రం పరిస్థితి-

చంద్రంకి అమ్మంటే అమిత ప్రేమ. అమ్మ అన్నది ఒక కమ్మని మాట. అమ్మ తప్పు చెయ్యదు- అని నమ్ముతూ పెరిగిన వాడు. ఆ నమ్మకానికి విఘాతం కలిగితే తట్టుకోలేనివాడు. అభిప్రాయ భేదం కలిగితే తనలోతాను కుమిలిపోతాడు గాని అమ్మకు ఎదురు చెప్పలేడు. ఇతరులేమనుకుంటారో అని ప్రతి విషయానికీ సంకోచిస్తూ ఏ పనీ ధైర్యంగా చేయలేక లోలోనే బాధపడే సున్నిత మనస్కుడు చంద్రం.

అనేక సందర్భాలలో అమ్మ అబద్ధం చెప్పడం, ఇతరులకు చెప్పే నీతులు తనేపాటించక పోవడం చూశాక అమ్మ కూడా తప్పు చేస్తున్నదే అనిపించినా, అలాంటి భావం కలిగినందుకు ఒణికిపోయేవాడు. అమ్మ తప్పు చేయదు, చేయదు; ఒక వేళ చేసినా అది మా మంచికోసమే అని సమర్థించుకునే వాడు.

అది చిన్నప్పుడు....గతం....

కానీ ఇప్పుడు తను ఎదిగాడు. మంచీ చెడ్డా చూడగలుగుతున్నాడు. తన అభిప్రాయాలను బయటకు చెప్పే ధైర్యం లేకపోయినా- చుట్టూ వున్న వారి వ్యక్తిత్వాలను పరిశీలించి అంచనా వేయగలుగుతున్నాడు.

తన ఉద్యోగం అన్నవరంలో. పెళ్ళికాక ముందు అక్కడేరూంలోవుంటూ హోటల్లో భోజనం చేసేవాడు. నెలవురోజుల్లో ఇంటికి రాగానే 'ఎంత చిక్కిపోయావురా బాబూ! దరిద్రగొట్టు హోటల్ కూడు పడ లేదురా నీకు' అని బెంగపడేది తల్లి.

కొడుకు పడుతున్న అవస్థ చూడలేకనే పెళ్ళిచేసిన అమ్మ- ఎందుకనో కోడల్ని కాపురానికి పంపలేదు సరికదా ''అంతా కలిసే వుందాం. రోజూ నువ్వు బస్సులో అన్నవరం వెళ్ళవు కాని'' అనేసింది.

పెళ్ళయ్యాక పెనంలో నుండి పొయ్యిలో పడినట్టు అయింది చంద్రం పరిస్థితి. బస్సు ప్రయాణం గంటన్నరే గాని దాని కోసం అరమైలు నడవాలి. అరగంట వెయిట్ చెయ్యాలి.

రోజూ ఉదయం ఏడున్నరకే రెండు ముద్దలు కతికి, క్యారేజీ పుచ్చుకొని ఆదరాబాదరా పరుగులు తీయడం, ఆపద్బాంధవి ఆర్టీసి బస్సు కరుణిస్తే ఆఫీసుకు సకాలంలో చేరడం- లేదా ఆఫీసర్‌తో తిట్లు! లంచ్ అవర్‌లో కరకర ఆకలితో క్యారేజీ విప్పితే- మెతుకులు మేకుల్లా తయారై తినబుద్ధి కాక- రెండు మెతుకులు ఎలాగో దిగమింగి-మిగిలింది పారబోయడం-

బీజింగ్ ఏషియాడ్‌లో -కుస్తీ పోటీల్లో స్వర్ణ పతకం సాధించడం కన్న- అన్నవరం పుణ్య క్షేత్రంలో సాయంకాలం బస్సు ఎక్కడం మరీ కష్టం.

అయితే ఏషియాడ్ స్వర్ణపతకంతో ఇంటిలో అడుగు పెట్టే ఏ వీరుడైనా కోరుకునేది- భార్య చిరునవ్వుతో ఎదురొచ్చి ఒక కప్పు టీతో బాటు అదో, ఇదో మహాహ ఓదో బహుమతిగా ఇవ్వాలని!

ఇంత చిన్న కోరిక కూడా ఈ వీరుడికి తీరడం లేదు.

పెళ్ళయ్యాక మరింత ఆరోగ్యం చెడి, నవనాడులూ కుంగిపోయి, ఉత్సాహం ఇంకిపోయి ఏ ఎనిమిది గంటలకో ఇంటిలో అడుగు పెడితే ఎదురుపడేది భార్య కాదు, అమ్మ!

''కోడలుండగా, నువ్వే టీ పట్టుకు రావాలా? ఇంకా నీ కెందుకమ్మా ఈ శ్రమ?'' అన్నాడొకసారి చంద్రం.

'అమ్మచేతి టీ కూడా పనికిరాదన్నమాట నీ కిప్పుడు?! ఎంత మారిపోయావురా' అనేసింది అమ్మ.

కానీ, అమ్మకు సమాధానం చెప్పలేక- అర్ధరాత్రి ఎప్పుడో బెడ్‌రూం చేరుకున్న భార్య మీద చిరుబుర్రుమన్నాడు.

ఇంటెడు చాకిరీ చేసిచేసి అలసటగా, విసుగుగా ఉందేమో- ''మీ కోపం నామీద కాదు, మీ అమ్మ మీద చూపండి. మొగుణ్ణి కొంగుకి కట్టుకొని ఎలా తిప్పుకోవాలో మీ అమ్మ మీ చెల్లికి నూరిపోస్తూ వుంటుంది. నేనూ ఆ పాఠాలే నేర్చుకుని ప్రయోగిస్తానేమోనని ఆమె భయం. అందుకే మనకు సినిమాలు లేవు. షికార్లు లేవు. కబుర్లు లేవు. నవ్వులు లేవు. మనం సుఖపడి పోకూడదు. మీరు సంపాదించి పెట్టే యంత్రం! నేను సేవలు చేసే కీలు బొమ్మ! యంత్రాలకెందుకు సినిమాలూ, షికార్లూ?! కీలు బొమ్మలకెందుకు సరదాలూ, నవ్వులూ?!! నా ఖర్మ ఇలా కాలినందుకు నా ఏడుపేదో నేను అఘోరిస్తా. చేతగాని మీ పౌరుషం నా మీద చూపి, మొనగాడిలా మీ మీసాలు మెలేసుకోండి'' ఏడుస్తూ దభీమని కింద పడిపోయింది సింధు.

అవాక్కై అయిపోయాడు చంద్రం.

అమ్మ అన్నది ఒక కమ్మని మాట. అమ్మ తప్పు చెయ్యదు అన్న భావన ఒకవైపు-

ఇంటికి ఒక మైలు దూరంలో వున్న కాన్వెంట్‌కి సిటీ బస్సులో వెళ్ళివచ్చేకూతురు అవస్థ చూడలేక- స్వంత ఇల్లు వదిలి, కాన్వెంట్‌కి దగ్గరగా అద్దె ఇల్లు చూసుకోమని సలహా ఇచ్చిన అమ్మకు- రోజూ అరవైమైళ్ళు ప్రయా ణం చేస్తూ ఆరోగ్యం పాడుచేసుకుంటున్న తన అవస్థ కనిపించదేం- అని బాధ మరో వైపు-

గలగలా కిలకిలా సినిమా సంసారం లాగ హాయిగా ఉన్న చెల్లి సంసారంచూసి ఆనందం ఒక ప్రక్క-

తన సంసారం అలా లేనందుకు దిగులు మరో ప్రక్క-

పెళ్ళయి పట్టుమని పదినెలలు కాకపోయినా-యుగయుగాలుగా సంసార భారం మోస్తూ వేదాంతం జీర్ణించుకున్న వాడిలా- నిర్లిప్తంగా, నిర్జీవంగా అయిపోయాడు చంద్రం.

* * *

చంద్రాన్ని వదిలి రూంలోంచి బయటకు పోయిన సూర్యం కాసేపు అలా తిరిగి మళ్ళీ వచ్చాడు. వస్తూనే-

'చంద్రుడూ! మన మధ్యనున్నది బంధుత్వమా? స్నేహమా? బంధుత్వమే అనుకుంటే తక్షణం బయటకు నడు! బంధుత్వాన్ని మించిన స్నేహబంధం అంటావా- కాసేపు కూర్చో'' అన్నాడు సీరియస్‌గా.

చంద్రం నిశ్చలంగా సూర్యాన్ని చూస్తూ ఊరుకున్నాడు. కదలలేదు. మెదల లేదు. అతడు బంధుత్వం కన్నా స్నేహాన్నే కోరుతున్నట్లు గ్రహించిన సూర్యం కుర్చీ దగ్గరగా లాక్కుని అతని ఎదురుగా కూర్చున్నాడు.

''రెండు రోజుల నుంచి ఈ హైదరాబాద్‌లోనే ఉంటున్నా. ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నిస్తున్నా'

రాజమండ్రిలో స్వంత ఇల్లు ఉన్న బావ- స్వగ్రామం వదలి, మరెక్కడికో ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నించడం ఆశ్చర్యమే.

'మీ చెల్లి మా యింట్లో అష్టకష్టాలూ పడిపోతున్నదంటే నమ్ముతావా చంద్రుడూ?'

''ఛఛ! అదేం మాట! ఎవరంటారలా?! మీది ఆదర్శకుటుంబం! అత్తాకోడళ్ళు ఎంత ఆత్మీయంగా ఉండొచ్చో, వదినా మరదలూ ఎంత అన్యోన్యంగా ఉండొచ్చో మిమ్మల్ని చూసి నేర్చుకోవాలి!'' ఆరాధనగా అన్నాడు చంద్రం.

''అదంతా గతం! మా యింటిలో మీ బిందు అష్టకష్టాలూపడిపోతున్నదని మీ అమ్మ దిగులు! మేము వేరింటి కాపురం పెడితే గాని మీ చెల్లి సుఖపడలేదట! అందుకని నేను మీ ఊరు బదిలీ చేయించుకోవాలని మీ అమ్మ హితబోధ! మీ చెల్లి సత్యాగ్రహం! అడకత్తెరలో పోక పరిస్థితిన్నుంఛి నన్ను రక్షించడానికి బదిలీ చేయించుకోమని మా అమ్మ కూడా నన్ను బలవంత పెడుతోంది...అందుకని..''

ఏమిటీ?! ఎవు మా కాకినాడకే బదిలీ చేయించుకుంటున్నావా, బావా! ఆశ్చర్యానందాలతో అరిచినట్లు అడిగాడు చంద్రం.

'నో! బావా అని పిలవకు! బంధుత్వం గుర్తుచేయకు!' గర్జించాడు సూర్యం. ఒక్కసారిగా అతని ముఖం భయంకరంగా మారిపోయింది. బీట్‌రూట్‌లా ఎర్రబడిన ముఖం! కళ్ళలోంచి నిప్పులు! స్వరంలో ఉరుములు!

ఈ హఠాత్ పరిణామానికి అదిరిపోయి బిక్క చచ్చి భయం భయంగా చూస్తూ ఊరుకున్నాడు చంద్రం.

'నువ్వు మెచ్చుకున్న ఈ కథలో కొడుకు లాగ- అత్త చెప్పుచేతల్లో తల ఊపే గంగిరెద్దు లాగ, భార్యకొంగుముడిలో సిటీ బస్సు టిక్కెట్ ముక్కలాగ పడి వుంటాననే భ్రమ పడకు మైడియర్ ఫ్రెండ్! మా అమ్మకు కొడుకు, కోడలు, కూతురు- అన్న తేడా లేదు. అందర్నీ సమానంగానే ప్రేమిస్తుంది. తల్లిప్రేమ చాలనీ, అత్త ఆదరణ అక్కర్లేదనీ కాలదన్నుతోంది మీ చెల్లి! అందుకే.. అందుకే.. మీ అమ్మ నీడ పడ నంత దూరంగా మన్యంలోకి బదిలీ చేయించుకుంటున్నా, కాకినాడకు కాదు! మా అమ్మకు స్థానం లేని ఇంట్లో మీ అమ్మకు స్థానం దొరుకుతుందని భ్రమపడకు! నా బంధువులు అడుగుపెట్టలేని చోట నా భార్య, బంధువుల నీడ కూడా పడకుండా చేస్తాను! అత్త ఆదరణ కంటే అమ్మ ప్రేమ మిన్న అనుకుంటున్న వెర్రిది మీ చెల్లి. దానికి ఎవరి ఆత్మీయతా అందకుండా చేస్తాను! చెప్పినట్టల్లా ఆడే గంగిరెద్దును కాను. కోపం వస్తే కిందపడదోసి కుమ్మివేసే నందీశ్వరుడ్ని అని మీ అమ్మకు నిరూపిస్తా! కొంగులో పడి వుండడానికి టిక్కట్టు ముక్కను కాను, అవసరం అయితే ఆ కొంగునికాల్చేసి బయట పడే అగ్నిశిఖను నేను-అని నిరూపిస్తా మీ చెల్లికి!''

ఆ ఆవేశం- ఆ ఆవేదనాభరిత స్వరం- వింటూ అవాక్కుగా ఉండిపోయాడు చంద్రం. మొదటిసారిగా అమ్మమీద అసహ్యం కలిగిందతనికి. అసహ్యం కలిగినందుకు భయమూ వేసింది.

ఛటుక్కున కుర్చీలోంచి లేచి చురుకుగా చంద్రం కళ్ళలోకి చూస్తూ అన్నాడు సూర్యం ''నిష్పక్షపాతంగా ఆలోచించి నిష్కర్షగా నిజం చెప్పు చంద్రుడూ! నిన్నూ, నీ చెల్లినీ ఒకేలాగ ప్రేమిస్తున్నదా మీ అమ్మ?! వేరింటి కాపురంలోగాని తన కూతురు సుఖపడలేదని కుతంత్రాలు పన్నుతున్న మీ అమ్మ- నీవు అన్నవరంలో కాపురం పెడతానంటే ఒప్పుకుంటుందా? నా సంపాదన ప్రతి పైసా నేను భార్య చేతిలో పొయ్యాలట! మరి నీ జీతం అమ్మకెందుకిస్తున్నావ్? నీకో నీతి! నీ చెల్లికి మరోనీతి! ఒకరకం ప్రేమతో మీ అమ్మ నీ చెల్లి సంసారంలో చిచ్చుపెడుతోంది. మరో రకం ప్రేమతో మీ అమ్మ నీ చెల్లి సంసారంలో నిప్పులు పోస్తోంది. ''అమ్మ అన్నది ఒక కమ్మని మాట'' అని పాటలు పాడుకుంటూ నువ్వు కూర్చో. కాని నేను మాత్రం 'అత్త అన్నది ఒక మెత్తని కత్తి' అని పాడుకుండా ఆఫీసుకి వెళ్ళి ఆ ట్రాన్స్ ఫర్ విషయం చూస్తాను'' అంటూ బట్టలు మార్చుకునేందుకు వెళ్లాడు.

చంద్రం మ్రాన్పడిపోయాడు. ఆలోచనల సుడిగుండంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

ఒకే అమ్మ! అవతారాలెన్నో! బిందుకు మమతల పాలవెల్లి! తనకు- శిలాహృదయం గల దేవత! సూర్యంకి మెత్తని కత్తి!

బావ చెప్పిన దానిలో అబద్ధం లేదని, అమ్మ తప్పు చేస్తోందనీ అతని మనసులో తెలుస్తూనే ఉంది. ఒక ఆదర్శ కుటుంబాన్ని తన తల్లి విచ్ఛిన్నం చేసిందన్న నిజాన్ని భరించలేకపోతున్నాడు. గుంజాటన పడుతున్నాడు. అమ్మ అన్నది ఒక కమ్మని మాట- అని పాడుకుంటూ కూర్చోవడం వల్ల ప్రయోజనం లేదు. చెల్లి సంసారంతోబాటు తన సంసారమూ విచ్ఛిన్నం అయ్యేట్టుంది. ఈ విచ్ఛిన్నాన్ని ఆపాలి. ఎలా? ఎలా?

సూర్యం నీట్‌గా టక్ చేసుకొని పౌడర్ రాసుకుంటూ 'చంద్రుడూ ఇంక నువ్వు వెళ్ళు! నేను ఆఫీసుకు వెళ్ళాలి' అన్నాడు.

చంద్రం ఛటుక్కున లేచి నిల్చున్నాడు ఏదో నిర్ణయానికి వచ్చినట్టు.

'బావా! నీ ట్రాన్స్‌ఫర్ ప్రయత్నం మానుకో. మనం ఇద్దరం కలిసి అమ్మకు బుద్ధి చెబుతాం. మన సంసారాల్ని చక్క దిద్దుకుందాం'' అన్నాడు బంధుత్వం, స్నేహం కలగలిసిన స్వరంతో